క్లుప్తంగా

ఎస్సీ కార్పొరేషన్ రుణాలివ్వాండి



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను సన్మానిస్తున్న అశోక్

కడ్తాల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుపేద దళితులకు రుణాలిచ్చి, వారి అభివృద్ధికి దోహదపడాలని కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.ప్రీతంను మర్యాదపూర్వకంగా కలిసి, పలు సమస్యలు విన్నవించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులందరికీ చేయూతనందించాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలలో కడ్తాల్ మండలానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు ఆయన చెప్పారు.

మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శేఖర్



ఇబ్రహీంపట్నం రూరల్: ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మొదటి ప్లీనరీ మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు తులిసిగారి శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సమ్మేళనం ఈ నెల 3న ఆదిబట్ల మున్సిపాలిటీలోని కల్వకోలు భూపాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



సీఐ మధును శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

మంచాల: స్థానిక ఠాణాకు నూతనంగా సీఐగా వచ్చిన మధును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ప్రతిఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. సమష్టి కృషితో మండలాన్ని ప్రశాంత వాతావరణంలో ఉంచేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం



విద్యార్థులతో కలిసి కేక్ కోస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులు గత కొన్నేళ్లుగా డైట్, కాస్మొటిక్ చార్జీలు సరిపోక ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం వాటిని పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చర్లపటేల్‌గూడలోని రాజమహేంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న చంద్రాయణగుట్ట, ఖైరతాబాద్ గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతతోపాటు విద్యార్థులు శుక్రవారం కేక్ కోసి ప్రభుత్వానికి కృతజ్ఞతలను తెలిపారు.

ఎంపీ మల్లు రవికి సత్కారం



ఆమనగల్లు: నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డా.మల్లురవిని మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు రమేశ్‌గౌడ్ సత్కరించారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కులగణనకు శ్రీకారం

- సర్వేలో నిమగ్నమైన అధికారులు
- ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కులగణన(సమగ్ర ఇంటింటి సర్వే) కార్యక్రమానికి శ్రీకారం పడింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను చేపట్టనున్న నేపథ్యంలో ఇళ్ల జాబితాను అధికారులు రూపొందిస్తున్నారు. ఇంటింటికి తిరిగి స్టిక్కర్‌ను అంటించి వివరాలు సేకరిస్తున్నారు. 54 రకాల ప్రశ్నలు, మరో 20 ఉప ప్రశ్నలతో కుటుంబ సర్వేను నిర్వహించనున్నారు. శుక్రవారం మండలంలోని ముకునూర్ గ్రామంలో నిర్వహించిన ఇళ్ల గుర్తింపు కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల స్పెషలాఫీసర్ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు కులగణనపై వారు దిశానిర్దేశం చేశారు.

సమగ్ర సర్వే షురూ

ఆమనగల్లు: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రారంభమైంది. ఆమనగల్లు మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ



ఇబ్రహీంపట్నం: ముకునూర్‌లో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న సిబ్బంది

యజమానుల పేర్లు గుర్తించి ఇంటికి స్టిక్కర్ అంటించారు. మండలంలోని సింగంపల్లి, ఆకుతోటపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ కుసుమమాధురి ఆధ్వర్యంలో ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టారు.

మంచాలలో..

మంచాల: మండల కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు కులగణనకు సంబంధించిన పత్రాలను శుక్రవారం తీసుకున్నారు. అనంతరం గ్రామాలకు వెళ్లి సర్వే ప్రారంభం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కుల, సామాజిక, ఆర్థిక పరమైన అంశాలను సేకరిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటప్రసాద్, ఎంపీఓ ఉమారాణి, వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి స్టిక్కర్

యాచారం: మండల పరిధిలో శుక్రవారం సమగ్ర కుటుంబ సర్వేకు ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రామాల్లోని జాబితా ప్రకారం ఇంటింటికి స్టిక్కర్లు అంటించారు. మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలతలు గునుగల్, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి స్టిక్కర్లు అందించారు. ఆయా గ్రామాల్లో ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో..

తుర్కయంజాల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలందరూ తమ వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కమ్మగూడలోని 22వ వార్డులో సర్వే జరుగుతున్న తీరును కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్యతో కలిసి పరిశీలించారు.

వివరాల సేకరణ

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శుక్రవారం మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని గ్రామాల్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు గ్రామాల్లో పర్యటించి, ఆయా గ్రామాల్లోని గృహాలు, కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. సర్వే తీరును ఎంపీడీఓ సుజాత, ఎంఆర్ఓ ముంతాజ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి సయ్యద్ పాషా సిబ్బంది పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న సిబ్బంది



యాచారం: గునుగల్‌లో..



కడ్తాల్: చరికొండలో..

ఆసరా పింఛన్లు పెంచాలి



మండల కేంద్రంలో మాట్లాడుతున్న నాయకులు

వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

తలకొండపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు తక్షణమే పింఛను పెంచాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాచారం జంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల పట్ల వివక్ష వీడాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) మండలాధ్యక్షుడు పెరుమాండ్ల నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జంగయ్యతో పాటు, జిల్లా ఉపాధ్యక్షుడు మహమద్ సలీమ్‌లు హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. వృద్ధులు, వితంతువులకు రూ.4000, దివ్యాంగులకు రూ.6000 పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 16న నిరసన దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. అదే విధంగా వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఇబ్రహీంపట్నంలో హామీలను అమలు చేయాలని పెద్ద ఎత్తున బహిరంగ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ, నాయకులు శ్రీకాంత్, యాదమ్మ, విష్ణు, రాజు, మహేష్, జంగయ్య, గణేష్, ప్రహ్లాద్, శేఖర్, శివ, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడికి అభినందనలు

ఇబ్రహీంపట్నం: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని శుక్రవారం టీడీపీ నాయకులు సన్మానించారు. టీడీపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకుడు మెట్టు దామోదర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు అబ్దుల్ లతీఫ్‌లు అభినందనలు తెలిపారు. ఆపత్కాలంలో సైతం పార్టీకి అండగా నిలబడి సేవలందించిన నన్నూరిని తితిదే సభ్యుడిగా నియమించడం పట్ల అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

8న రక్తదానం శిబిరం

ఆమనగల్లు: పట్టణంలో ఈనెల 8న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆమనగల్లు లయన్స్‌క్లబ్, కాంగ్రెస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరంలో ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు.

వెలుగులు మెరిసే.. ఆనందం విరిసె

దీపావళి పర్వదినాన్ని ఎంతో వైభవోపేతంగా ప్రజలు నిర్వహించుకున్నారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో గురువారం ఉదయమే ఇళ్లు, వ్యాపార సంస్థల్లో లక్ష్మీపూజను జరుపుకొన్నారు. శుక్రవారం సైతం వ్రతాలు, నోములను భక్తిశ్రద్ధలతో నోచుకున్నారు. ఈ సందర్భంగా బంతి, చామంతి పూలకు మార్కెట్లో భలే డిమాండ్ ఏర్పడింది. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రమిదలను వెలిగించారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. పలు చోట్ల యాదవులు నిర్వహించిన సదర్ సయ్యాటలు చూపరులను ఆకట్టుకున్నాయి. దున్నపోతుల విన్యాసాలను చూడటానికి ప్రజలు ఎగబడ్డారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: బొమ్మలు, దొంతులను కొనుగోలు చేస్తున్న స్థానికులు



ఇబ్రహీంపట్నంరూరల్: బొమ్మల కొలువులో ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి దంపతులు



ఆమనగల్లు: కాకరపుల్లలతో చిన్నారుల సందడి



ఇబ్రహీంపట్నం: శేరిగూడ సదర్ సమ్మేళనంలో బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్



ఇబ్రహీంపట్నంరూరల్: పోచారంలో సదర్ ఉత్సవాల్లో ఏసీపీ రాజు



కడ్తాల్: టపాసులు కాల్చుతున్న ప్రజలు



ఆమనగల్లు: దీపాలు వెలిగిస్తున్న మహిళ



తలకొండపల్లి: ఎమ్మెల్యేతో శ్రీనివాస్‌రెడ్డి



ఆమనగల్లు: బాణసంచా కాలుస్తున్న మహిళలు



ఆమనగల్లు: నోములో యువతి



ఇబ్రహీంపట్నం: బాణసంచా వెలుగుల్లో బాలుడి ఆనందం



ఆమనగల్లు: దీపం కాంతులలో చిన్నారి

ఆలయాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మైసిగండిలో ప్రత్యేక పూజలు

కడ్తాల్: దక్షిణ తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మైసమ్మకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేను పూలమాల శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా నాయకుడు భాస్కర్ రెడ్డి, ఆలయ ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి, ఆలయ నిర్వాహకులు భాస్కర్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు చందోజీ, తులసీరాంనాయక్, జవహర్‌లాల్‌నాయక్, అరుణ్, సురేందర్‌రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మైసిగండి మైసమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

దేవాలయాల నిర్మాణాలకు భూమిపూజ

మండల పరిధిలోని మైసిగండి గ్రామ సమీపంలోని పురేనగిరిగుట్టపై దత్తాత్రేయస్వామి, శివాలయాల నిర్మాణ పనులకు గురువారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తి భావం పెంపొందుతుందని, ఆధ్యాత్మికత విరాజిల్లుతుందని పేర్కొన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూద్యానాయక్, నాయకులు నర్సింహ, భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, చందోజీ, జవహర్ లాల్, రూప్‌సింగ్, తారాసింగ్, రవి, హీరాసింగ్, సుబ్బు, శంకర్, రాజా, శ్రీను, కిషన్, తులసీరాం, బీచ్యా, బిక్కు పాల్గొన్నారు.

మహనీయుల సేవలు మరువలేనివి



మంచాల: ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



తలకొండపల్లి: దివంగత నేతలకు అంజలి ఘటిస్తున్న నాయకులు

మంచాల: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని మండలంలోని ఆరుట్ల గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానికంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలను గుర్తు చేసి కొనియాడారు. ఈ సందర్భంగా ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, శ్రీకాంత్, పాండరినాథ్‌గౌడ్, యాదయ్య, వెంకటేష్, మల్లేశ్, జంగయ్య, చంద్రయ్య, రాములు, వాజీద్, సలాం, ఎల్లేశ్, రమణారెడ్డి, రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పటేల్ జయంతి

తలకొండపల్లి: మండల కేంద్రంలో గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, నాయకులు కృష్ణ, అజీం, ఆరీఫ్, రమేశ్, పర్వతాలు, శ్రీను, సురేశ్, దేవ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలం సాధించేందుకు పోరు



గట్టుఇప్పలపల్లిలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన నాయకులు

- గట్టుఇప్పలపల్లిలో రిలే నిరహార దీక్షలు
- మండలముగా ప్రకటించాలని డిమాండ్

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు రిలే నిరహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మండలంలోనే తమ గ్రామం పెద్దదని, సుమారుగా 5 వేలకు పైగా జనాభా ఉంటుందని, నిత్యం తమ అవసరాల నిమిత్తం 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న తలకొండపల్లి మండలానికి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రెండు పర్యాయాలు సుమారుగా 140 రోజులు దీక్షలు చేపట్టిన కూడా ప్రభుత్వంలో ఏలాంటి చలనం రాలేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా గోడు ఆలకించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామని తెలిపారు. మండలాన్ని సాధించేవరకు దీక్ష విరమించబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు అశోక్‌గౌడ్, శరత్‌చ్చంద్ర, రాజు, నిరంజన్, అనిల్, ఆంజనేయులుగౌడ్, చెన్నయ్య, తేజ, కృష్ణాజీ, ప్రణయ్‌కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాల బారిన పడొద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

యాచారం/మంచాల: యువతకు చదువుతో పాటు క్రీడలు సైతం ఎంతో ముఖ్యమని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మండల పరిధిలోని మాల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ నిర్వహిస్తున్న ఎంపీఎల్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఏసీపీ రాజు హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం ఎంతో విలువైందని, చెడు అలవాట్లకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో యాచారం సీఐ శంకర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంచాల మండల కేంద్రంలో సీఐ మధుతో కలిసి ఏసీపీ పర్యటించారు. యువత వ్యసనాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. వీఆర్‌వన్ ఫౌండేషన్ సభ్యుడు బాలరాజు ఏసీపీ, సీఐలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో



యాచారం: విజేతకు బహుమతి అందజేస్తున్న ఏసీపీ రాజు తదితరులు

ఎస్సై లాలయ్య, ఏఎస్సై సతీష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తుల సంచారంపై అప్రమత్తం

గ్రామాల్లో పర్యటించే కొత్త వ్యక్తుల సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో ఆయన పర్యటించారు. కొత్త వ్యక్తుల సంచారం పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. అనంతరం ఆకులామైలారం గ్రామంలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పట్టణానికి చెందిన తాళ్ల నిర్మలమ్మ కుమారుడు బన్ని అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎన్‌పీఆర్డీ నాయకుడు జెర్కొని రాజు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి(ఉపాధ్యాయ) దృష్టికి తీసుకెళ్లడంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. ఈ చెక్కును నిర్మలమ్మకు శుక్రవారం రాజు అందజేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కొందుర్గు: సీసీ కెమెరాలు ఉండటంతో కొంతవరకు నేరాలను నియంత్రించడానికి అనుకూలంగా ఉంటుందని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లిలో శుక్రవారం ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ హాజరై మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉంటాయని, దొంగతనాలు చేయడానికి సహితం వెనుకడుగు వేస్తారన్నారు. ఏమైనా నేరాలు, దొంగతనాలు జరిగినా త్వరగా ఛేదించడానికి వీలుపడుతుందన్నారు. ఇందుకోసం దుకాణాల యజమానులు సొంతంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని ముఖ్య కూడలీల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.